97

# మాయ తివాచి

మనది చాలా చిత్రమైన సమాజం. ఈ చిత్రమైన సమాజంలో విచిత్రమైన సాంఘిక విలువలు కనబడతాయి. మన సమాజంలో, కొందరు ఎక్కువ కులంలో పుడతారు. మరికొందరు ఓ మాదిరి కులంలో పుడతారు. ఇంకొందరు అంటరాని కులంలో పుడతారు. ఈ ఆఖరికులంలో పుట్టినవారు శతాబ్ధాలుగా ఊరికిదూరంగా ఉంటున్నారు. వారు గ్రామాల్లోకి రావడానికి లేదు. కానీ గ్రామాలకు కావలసిన అడ్డమైన చాకిరీ వీరేచేయాలి. వీరికి తాగడానికి నీళ్ళుండవు కానీ గ్రామస్థులక్కావలసిన నీటి బావుల్ని, చెరువుల్నీ వీళ్ళే తవ్వుతారు. వీరికి సొంత పొలాల్లేవు. కానీ ఊరివాళ్ళ పొలాల్లో వీరే పనిపాట్లు చేయాలి.

వీరిని ఉద్ధరించే ప్రయత్నాలు, గతంలో అక్కడక్కడా కనపడతాయి. కానీ, ఈ ప్రయత్నాల కొక నిర్ధిష్టమైన రూపం వొచ్చింది గాంధీ గారి కాలంలోనే! అంత క్రితం ఈ అంటరాని వారికున్న పేర్లను తొలగించి 'హరిజను'లనే పేరును గాంధీగారే వ్యాప్తి చేశారు.

చెప్పొచ్చేదేమిటంటే, అబ్బులు ఈ అంటరాని కులంలో పుట్టాడు. అతనికి పొలాల్లో పనిచెయ్యడం, పశువుల్ని కాయడం, గొడ్డుచాకిరీ చేయడం, ఉన్నప్పుడు తినడం, లేనప్పుడు పస్తు పడుకోవడం తప్ప మరోటి చేతకాదు.

"నా చిన్నతనమంతా పల్లెల్లోనే గడిచిందండీ! మా అయ్యతో బాటు నేను కూడా పొలం పోతుండేవాణ్ని. అయ్య అరక దున్నుతుంటే, నేనుకూడా అయ్యతో బాటు, అరకవెంట తిరుగు తుండేవాణ్ని! రాఘవయ్యగారి పొలం, తిప్పగుళ్ళ పక్కగా వుండేది. పొలానికి వోవేపుగా "ఉబ్బలివాగు" వుండేది. ఆ వాగంటే పెద్దవాళ్ళకు చచ్చేంత భయం. కానీ కుర్రకారుకు బోలెడంత సరదా. నేను, రోశయ్యగారి నకిలేసుగాడూ కలిసి, తిప్పగుళ్ళనుంచి, రాళ్ళు, బండలు తెచ్చి, ఆ ఉబ్బలిలో వేస్తుండేవాళ్ళం. పైకి చెక్కుగట్టి, నెర్రెలిచ్చి, మామూలునేలలాగా కనిపిస్తూంది గానండి- అడుగు వేశామంటే పాతాళానికి పోవలసిందే. చూస్తూ చూస్తూ ఉండగానే మేం వేసిన రాళ్ళన్నీ ఆ ఉబ్బలిలో మునిగిపోయేవి. ఎక్కడికి పోయేవో, ఎంతదాకా పోయేవో మాకు తెలియదు." అన్నాడు సత్యారావు కింద పెదవిని సుతారంగా కొరుక్కుంటూ.

అబ్బులు(గాడి) మూడో కొడుకు సత్యారావు. అసలు పెద్దవాణ్నీ, రెండోవాణ్నీ కూడా అబ్బులు చదివించుదామనుకొన్నాడు. ఊళ్ళో బడి కూడా వుంది. కానీ వీలుపడింది కాదు. బడి - రాఘవయ్యగారి పిల్లలు, వారి చుట్టాల పిల్లలు చదువుకొంటున్నారు. పైగా రాఘవయ్యగారే గ్రామ పంచాయతీ ప్రెసిడెంటు కూడా. అబ్బులు పెద్ద జీతగాడుగా పనిచేస్తున్నది ఇక్కడే. గ్రామ పంచాయతీ ప్రెసిడెంటుగారి కొడుకూ, ఆ ప్రెసిడెంటుగారి జీతగాడి కొడుకూ, పక్క పక్కనే కూచొని చదువు కోవడానికి ఇదేం దేశం గనక?

రాఘవయ్యగారు 'వొద్దురా' అని ఏనాడూ అనలేదుగానీ, అబ్బులుకే భయం వేసింది. దిక్కుమాలిన చదువుకోసం, కొడుకును పోగొట్టుకోవడానికి అబ్బులు సిద్ధంగా లేడు. రాఘవయ్యగారి అఖరి తమ్ముడు బాలకోటేశ్వరరావుగారు ఏడాది కిందట తిప్పగుళ్ళ దగ్గర గూడెం ఆడదాన్ని అఘాయిత్యం చేసినప్పుడు రాఘవయ్యగారు, ఊరు మొత్తాన్ని కట్టడిచేసి గూడెం వాళ్లను పనుల్లోకి పిలవడం మానేశాడు. గూడెం అల్లాడిపోయింది.

నెల రోజుల తరువాత గూడెం కట్టగట్టుకొని, రాఘవయ్యగారి పాదాక్రాంతమయింది. ఇది .జరిగిన రెండు నెల్లకే అఘాయిత్యానికి గురయిన ఆడది దొంగ ఉబ్బలిలో 'పొరబాటుగా' కూరుకుపోయింది.

"అప్పుడు నాకు ఎనిమిదేళ్ళుంటాయండీ!" అన్నాడు సత్యారావు. నాకీ సంగతులన్నీ బాగా తెలుసు. కానీ మా వాళ్ళెవరూ కిక్కురుమనలేదు అని, అక్కడ బతకలేరు కూడా. మా పెద్దన్నకు నన్ను చదివించాలని వుండేది. ఆయన నన్ను బస్తీకి తీసుకొచ్చి, హాస్టల్లో చేర్పించాడు. అక్కడ నాతో బాటు ఇంకో వందమంది పిల్లలుండేవారు."

హాస్టలు సంగతులడిగినప్పుడు సత్యారావు కళ్ళు ఎర్రబడ్డాయి. అది హాస్టలు కాదు. నరక కూపం. గొడ్లసావడికన్నా కనాకష్టం. చదువు కోవడానికి లేదు. తినడానికీ లేదు. పడుకోవడానికీ లేదు. గ్రామాలల్లో వుండే దోపిడీ ఒక రకం. ఇక్కడ జరిగే దోపిడీ మరో రకం. నాకు అసహ్యమేసింది. హాస్టల్ వార్డెన్‌తో పోట్లాడి వాణ్ని కొట్టి పారిపోయివచ్చాను" అన్నాడు సత్యారావు.

చాలా రోజుల బాటు సత్యారావు గాలికి తిరిగాడు. కొంతకాలం పాటు ఇటికలు, రాళ్ళు మోసాడు.

"నన్ను చూసి జనం భయపడ్తారు. బహుశా ఆకారమే కారణమనుకొంటాను అన్నాడు సత్యారావు నవ్వి.

గడిచిన ఆరేళ్లుగా ఈ పనిలో వున్నాడు. ముందుగా రోజుకూలీకి పనిచేశాడు. రోజుకు మూడో నాలుగో ఇచ్చేవారు. ఆ తరువాత పెద్ద పెద్ద గుత్తాదార్ల దగ్గర పనిచేశాడు. ఓ మొత్తం ఇంటికి రంగు వేయడానికో, సున్నం వేయడానికో గుత్తాదారు కాంట్రాక్టు తీసుకొనేవాడు. రంగులు, సున్నం, అతనే ఇచ్చేవాడు. తను, మరొక ఇద్దర్ని చేతికింద వేసుకొని ఆ పని పూర్తి చేసి, ఆ ఇద్దరికి రోజుకూలీ యిచ్చి మిగిలింది తను ఉంచుకొంటున్నాడిప్పుడు.

"అయ్యా! నా అసలు పేరు సత్యారావు కాదు. 'సత్తెయ్య'. హాస్టల్లో చేరినప్పుడు. మిగతా పిల్లల్ని చూసి, నేనే మార్చుకొన్నాను. చిన్నప్పుడు చాలా దరిద్రమనుభవించానండీ. ఒక్కటే బొందులాగు వుండేది. గూడెం ముందు, మర్రిచెట్టుకింద నిలబడి, పాంట్లు, షర్టులు తొడుక్కున్న పిల్లల్ని చూసి, అలాంటివి నాకూ లేనందుకు ఏడ్చేవాణ్ని ఏడిస్తే వస్తాయనీ కాదండీ, ఏడవడం తప్ప ఇంకేమీ చెయ్యలేను గనుక ఏడిచేవాణ్ని. ఆ సరదాలన్నీ ఇప్పుడు తీర్చుకొంటున్నాను. ఒక్క సంగతి. ఈ కుంచె నా చేతిలో లేకపోతే, నా వొంటిమీద ఈ సున్నం మరకలు లేకపోతే, నేను సున్నం కొడతానని, మీరు కలలో కూడా అనుకోలేరు. అవునా?" అన్నాడు సత్యారావు.

"మీరు పెద్దవారు. అనుభవం వున్నవారు. నిజం చెప్పండి. తియ్యని కబుర్లతో కడుపు నిండుతుందా? నీతికి, నిజాయితీకి స్థానం వుందా? మా కేదో వొరగబెడుతున్నామంటున్నారు. పెడుతున్నారేమో నాకు తెలియదు. మీలాంటి వాళ్ళను, మ కోసం కాగితాలమీద కేటాయించిన కోట్ల రూపాయలు కనబడతాయేగానీ, మాకు ముట్టే పైసలు, గవ్వలు కనబడవు. అమ్మ బాబోయ్! అభ్యుదయం అంటారు మీరు. అసలు సంగతి మాకు తెలుసు. నా చదువా? ఏదో ఏడిశాను. ఇప్పుడు ప్రయివేటుగా చదువుకొంటున్నాను. నన్ను కాస్త కాళ్ళు నిలదొక్కుకోనీండి. నేను తిన్నగా నిలబడితే నాలాంటి మరో నలుగురికి నా సాయం తప్పకుండా ఉంటుంది." అన్నాడు సత్యారావు - కుందెను సున్నం బాల్చీలో ముంచుతూ.